క్లుప్తంగా

కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న అధ్యాపకులు

నవాబుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి విన్నవించారు. త్వరలోనే కళాశాలను అధికారులతో వచ్చి సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చాడు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి, అధ్యాపకులు మంజుల, నరేష్, రమేష్, శ్రీనాథ్, వెంకటయ్య, కరుణాకర్, దాకేశ్వర్, సందీప్, కీర్తిసమియేల్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

టీఎస్ యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు డీఏ ప్రకటించాలని రాష్ట ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు బాబురావు అన్నారు. గురువారం సభ్యత్వ నమోదులో భాగంగా మండల పరిధిలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏను ప్రకటించాలన్నారు. రాష్ట్ర రెండవ పీఆర్సీ కమిటీ నివేదికపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి, 30 శాతం ఫిట్మెంట్ అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ వికారాబాద్ మండల అధ్యక్షుడు వినోద్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి, రాజేష్ పాల్గొన్నారు.

వెంటనే ప్రకటించాలి

పీఆర్సీ, ఫిట్‌మెంట్ 50శాతం వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ మండల పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 11, 12 సవరించి బీఎడ్ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టు కల్పించాలన్నారు. సర్వీస్ రూల్స్ తీసుకొచ్చి జేఎల్, డీఎల్, డైట్ లెక్చరర్, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులను టీచర్స్ ప్రమోషన్‌లతో నింపాలన్నారు. 2003 డీఎస్సీ వారికి ఓల్డ్ పెన్షన్ వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రమేష్ షిండే, ఉపాధ్యక్షుడు వీరేశం, కేదార్‌నాథ్, మహేందర్, ఇబ్రహీం, శ్రీనివాస్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

బాలముకుందంకు సన్మానం



బాలముకుందంను సన్మానిస్తున్న నేతలు

కుల్కచర్ల: పరిగి సివిల్ కోర్టు ఏజీపీగా నియమితులైన సీనియర్ న్యాయవాది బాలముకుందంను మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతానికి చెందిన ప్రతి భగల న్యాయవాదులను గుర్తించి ప్రభుత్వం ఏజీపీగా నియమించడం సంతోషకరమన్నారు. నిరుపేదలకు న్యాయం జరిగేలా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గాంగ్యానాయక్, రవిలాల్, రఘు పాల్గొన్నారు.

పోటీలో జూనియర్ కృష్ణంరాజు

కొడంగల్ : నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు జూనియర్ కృష్ణంరాజు తెలిపారు. గురువారం నామినేషన్ వేసినట్లు చెప్పారు. ఈ నెల 10 నుంచి సెప్టెంబర్ 10వ వరకు ఆన్‌లైన్ లో ఓటీపీ ద్వారా ఎన్నిక జరుగుతుందన్నారు.కార్యకర్తలు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉపాధ్యాయులకు పన్మానం

ధారూరు: మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామ పాఠశాల నుంచి బదిలీ అయిన, కొత్తగా వచ్చిన టీచర్లను గురువారం గ్రామస్తులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అలాగే కొత్తగా వచ్చిన గ్రామ కార్య దర్శి సుగుణను కూడా సన్మానించారు.

నోట్ పుస్తకాల అందజేత

కొడంగల్ : మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, న్యాయవాది సుధాకర్‌రెడ్డి, గోడల రాంరెడ్డిలు గురువారం వందనోటు పుస్తకాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తన వద్దకు వచ్చే వారు శాలువాలు, పూలదండలు, బొకేలు తీసుకొని రావద్దని సూచించారు. పేద విద్యార్థులకు చేయూత అందించే విధంగా ఏమైనా సాయం చేయాలన్నారు.

జోరుగా స్వచ్ఛదనం.. పచ్చదనం

మొక్కలు నాటిన నాయకులు, అధికారులు



తాండూరు టౌన్ : సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు టౌన్ : తాండూరు మున్సిపల్ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 10వ వార్డులోని సాయిపూర్, భవానినగర్‌ల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ పటోళ్ల రత్నమాలతో కలిసి ప్రారంభించారు. అలాగే, రాజీవ్‌కాలనీలో రూ.30లక్షలతో పబ్లిక్ పార్కు నిర్మాణానికి కౌన్సిలర్ వెంకన్నగౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల హామీ ప్రకారం మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, సీసీరోడ్లు, మురుగు కాల్వ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని చెప్పా రు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, నాయకులు ధారాసింగ్, అబ్దుల్ రవూఫ్, నారాయణరెడ్డి, హబీబ్‌లాలా, జుబేర్‌లాలా, వెంకట్రాములు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనంతో ఆరోగ్యం

తాండూరు టౌన్ : స్వచ్ఛదనం, పచ్చదనంతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌కాలనీలో నిర్వహించిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి ఆధునిక జీవనప్రపంచంలో కాలుష్యం, వ్యాధులు ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత ముఖ్యమన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల ఈగలు, దోమల పెరిగి ప్రజలు వ్యాధుల బా రిన పడుతున్నారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నమాట్లాడుతూ.. పచ్చదనం పంపునకు ప్రజలు విధిగా ఇంటి ఎదుట మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పటోళ్ల బాల్‌రెడ్డి, కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, డీఈ ఖాజాహుస్సేన్, కౌన్సిలర్లు వెంకన్నగౌడ్, రత్నమాల, నీరజ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెద్దేముల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్ మండల గోట్లపల్లి మోడల్ స్కూల్, గిర్మాపేర్ గ్రామాల్లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని, ప్రతి ఇంటికి పంపిణీ చేసిన ఆరు మొక్కలు నాటాలన్నారు. అధికారులు మొక్కలు నాటడంపై చూయిస్తున్న శ్రద్ధ వాటి సంరక్షణపై చూయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, ఏబ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సింలు, జిల్లా పశుగణాభివృద్ధి మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ జర్నప్ప, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

యాలాల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కేజీబీవీలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో వాయు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వసతి గృహ విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, రోగాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, అక్బర్‌బాబా, తహసీల్దార్ చంద్రయ్య, ఎంపీడీఓ పుష్పలీల, పీహెచ్‌సీ, కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యవంతంగా పల్లెలు

కుల్కచర్ల: 'స్వచ్ఛదనం-పచ్చదనం' తో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పెంపొందించడం జరుగుతోందని మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య, ఎంపీఓ ఖరీం అన్నారు. గురువారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వచ్ఛదనంతో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పచ్చదనంతో ప్రకృతి ఆహ్లాదకరంగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

యాలాల: సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పేదలు కార్పొరేట్ వైద్యం పొందడంలో ఆర్థిక ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంలో సీఎంఆర్ఎఫ్ అందిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, నాగయ్య, శేఖర్, లాలప్ప, మోయిజ్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

దోమ : గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రజిత, ఎంపీఓ సోమలింగం ఆస్పతరి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లోని మురుగు కాల్వలను శుభ్రం చేయడం, ముళ్ల కంచెలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమ లింగం, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్వాడీ టీచరు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

పరిగి: ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని 4వ వార్డు న్యామత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 'స్వచ్ఛదనం- పచ్చదనం'లో భాగంగా విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటి, మొక్కను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో నిత్యం మురుగుకాలువల శుభ్రం చేస్తూనే ఉన్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు రవీందర్, తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రత పనులు

బొంరాస్‌పేట : గ్రామాల్లో కొనసాగుతున్న స్వచ్ఛదనం- పచ్చదనంపై ఆయా గ్రామా ల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, నీటి ప్రదేశాల వద్ద జాగ్రత్తలు, వీధుల్లో మట్టిపోయించే పనులు గ్రామప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా మారుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పరిగి: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



యాలాల: మొక్కలు నాటిన ఎమ్మెల్యే , సిబ్బంది



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్ గ్రామంలో..

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

కొడంగల్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం సీపీఆర్‌పై కార్డియాలజిస్టు డాక్టర్ బిక్కునాయక్ అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి సిబ్బందికి వివరించారు. సీపీఆర్ చేస్తే మనిషి బతికే అవకాశం ఉందని, ఎదపై ఒత్తిడి పెంచడం వల్ల గుండె పని చేయడం ప్రారంభిస్తుందని చెప్పారు. దీంతో బాధితులను ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, న్యూరోసర్జన్ డాక్టర్ కిషోర్, డాక్టర్ సాకేత్, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అనంతగిరి: వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలో కరెంట్ బిల్లింగ్ ఆపరేటర్‌గా పని చేస్తున్న నవీన్‌కుమార్ 3 నెలల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అధికారులు, విద్యుత్ కార్మికుల హెచ్ 82 యూనియన్ తరఫున సదరు వ్యక్తికి రూ.60వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల ఏఈ పూర్ణచంద్ సబ్ ఇంజనీర్ నరేష్, ధారూర్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఎల్ఐ హరినాథ్, లైన్ మెన్ శంకర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్, అక్తర్ అలీ, విజయ్, యాదయ్య, నజీర్, లక్ష్మణ్, తేజ పాల్గొన్నారు.

పాఠశాల భవన సామగ్రి వేలం

దోమ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పురాతన భవనాల రేకులు, డోర్లు, కట్టెలను వేలం పాట నిర్వహిస్తామని తహసీల్దార్ పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పాఠశాలలో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కూల్చివేశామన్నారు. వాటికి సంబంధించిన 150 రేకులు, టేకు డోర్లు, టేకు కట్టెలు, కిటికిలను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే వారు రేకులకు రూ.10 వేల డిపాజిట్, కట్టెలకు రూ.11 వేల డిపాజిట్ చేయాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు డబ్బులను వెంటనే ఇచ్చేలా చూడాలన్నారు.

కోర్టు గేట్ మూసి విధుల బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పరిగి: జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడికి నిరసనగా గురువారం న్యాయవాదులు పరిగి కోర్టు గేట్లు మూసి, విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన క్లయింట్ కేసు విషయంలో స్థానిక సీఐని కలవడానికి న్యాయవాదులు అమృతరావు, కవితలు వెళ్లగా వారిపై పోలీసులు చేయి చేసుకోవడం సరికాదన్నారు. సీఐ, ఎస్సైలను వెంటనే సస్పెండ్ చేయాలని పోలీస్‌శాఖను డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని కోరారు. న్యాయవాదులపై నిత్యం దాడులు జరుగుతూనే ఉన్నాయని, అయినా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భక్తకుమార్, న్యాయవాదులు లింగం, నరేందర్, ఆనంద్‌గౌడ్, బాలముకుందం, రాజేందర్ పాల్గొన్నారు.

గొల్ల చెరువును పరిరక్షించండి

బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం



ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తాండూరు టౌన్ : పట్టణ పరిధిలోని గొల్ల చెరువును కబ్జా చెర నుంచి కాపాడాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు మల్లేశం అన్నారు. గురువారం ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ డీఈ, సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. గొల్ల చెరువు కబ్జా సమస్యకు పరిష్కారం కోరుతూ అనేకమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఇకపై వినతిపత్రాలకు బదులుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. గొల్లచెరువు పరిధిలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రైవేటు సర్వే నంబర్లు, బైనంబర్లు వేసి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి గొల్ల చెరువును పరిరక్షించి, కబ్జారాయుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు అంతారం లలిత, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు కృష్ణ, రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి కిరణ్, బిచ్చప్ప, చందు, శ్రీకాంత్, నరేష్, ప్రభాకర్ గౌడ్, సాయిలు, ప్రభాకర్ రెడ్డి తదితరులుఉన్నారు.

సమయానికి బస్సులు నడపాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

తాండూరు టౌన్ : గ్రామాల నుంచి పట్టణానికి చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు సమయానికి బస్సులు నడపాలంటూ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు గురువారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో పట్టణానికి పాఠశాలలు, కళాశాలలకు వస్తుంటారన్నారు. జుంటుపల్లి, రుద్రారంతో పాటు పలు గ్రామాల నుంచి విద్యార్థులు వందల మంది ఒకే ఒక్క బస్సులో రావడం ఇబ్బందిగా ఉందన్నారు. కావునా, ఏ రూట్లలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందో, ఆ రూట్లలో ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతున్నామన్నారు. వినతిపత్రంలో అందజేసిన వారిలో యుఎస్ఎఫ్ఐ నాయకులు దీపక్‌రెడ్డి, సాయి, చారి, విద్యార్థినులు రాజేశ్వరి, మంజుల, అక్షిత, జ్యోత్స్న, అనూష, సంధ్యారాణి ఉన్నారు.

రాయితీపై ఆర్టీసీ అద్దె బస్సులు

పరిగి: శ్రావణమాసం, పెళ్లిల ముహూర్తాల నేపథ్యంలో ఆర్టీసీ అద్దె బస్సులు తీసుకునేవారికి పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్లు పరిగి డీఎం కరుణశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి డిపాజిట్ లేకుండానే ప్రయాణించే కాలానికి, దురానికి వసూలు చేస్తామన్నారు. ఈ నెల 6 నుంచి వచ్చే నెల 3 వరకు బుక్ చేసుకున్న వారికి రాయితీ కలిప్తామన్నారు. కావునా, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



తల్లులకు సూచన చేస్తున్న ఉపాధ్యాయురాలు

కుల్కచర్ల: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని రాంనగర్ గ్రామపంచాయతీ గోప్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవనీత, అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ అన్నారు. గురువారం గోప్యానాయక్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు.

నాగుల చవితి పూజలు

కొడంగల్ : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నాగుల విగ్రహాలకు అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. నాగుల చవితిని పురస్కరించుకొని పాలు, పెరుగు, నెయ్యి, పసుపు చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో నాగదేవతలకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



అభిషేకం చేస్తున్న అర్చకుడు

జీపీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



పరిగి బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పరిగి: జీపీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేస్తున్నా.. కనీస వేతనం రూ.26వేలు చెల్లించడం లేదని వాపోయారు. పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 51ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ జీవో వల్ల కార్మికులు రాత్రి, పగలు తేడా లేకుండా శ్రమించాల్సి వస్తుందన్నారు. పంచాయతీ కార్మికులు చనిపోతే వారికి రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



దౌల్తాబాద్: ధర్నా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

దౌల్తాబాద్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్సచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గ్రామపంచాయతీ వర్కర్లు తమ డిమాండ్ల సాధనకు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల హామీలు అమలు చేయాలని, పీఆర్‌సీలో అర్హులుగా గుర్తించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలన్నారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రత్యేక అధికారి దానయ్య



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న దానయ్య

దుద్యాల్ : వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి దానయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని చెట్టుపల్లి తండా, చిలుముల మైల్వార్ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో జ్వరం, ఇతర వ్యాధులు ఉన్న వారి వివరాలు, కుక్కల వివరాలను నమోదు చేశామన్నారు. ఆయా గ్రామాల్లో 100 కుక్కలు ఉన్నట్లు తెలిపారు. వర్షాకాలం డెంగ్యూ వ్యాధి వ్యాపించే అవకాశాలు ఉన్నందున ప్రజలు ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. గ్రామంలోని మురుగు కాల్వలను పరిశీలించి పంచాయతీ కార్మికుల సహాయంతో శానిటైజేషన్ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరయ్య, శ్రీవాణి , ఏఎస్ఎం షాహెద బేగం, ఆశ కార్యకర్తలు విజయలక్ష్మి, లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.